ప్రజాశక్తి
బుధవారం 15 అక్టోబర్ 2025
5
కర్నూలు





మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

హంద్రీనీవాతో రాయలసీమకు జలసిరి

- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

హంద్రీనీవా ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని మొత్తం 517 చెరువులకు గాను 299 చెరువులని కృష్ణాజలాలతో నింపామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. హంద్రీ నీవా రాయలసీమకు జలసిరి అని పేర్కొన్నారు. మంగళవారం కర్నూలు ఇరిగేషన్ సిఇ కార్యాలయం లో మంత్రి రామానాయుడు సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ కుప్పం వరకు కృష్ణాజలాలు తరలి వెళ్ళడంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లన్ని 961 టిఎంసిల సామర్థ్యం ఉంటే 844 టిఎంసిలతో వాటిని నింపగలిగామన్నారు. అంటే 87.86శాతం నీటిని నిల్వ చేయగలిగామని వివరించారు. రాయలసీమలోని మొత్తం 38 నియోజకవర్గాల పరిధిలో హంద్రీనీవా ప్రాజెక్టు కాలువలు విస్తరించి ఉన్నాయని అన్నారు. ఈ కాలువలకు అనుబంధంగా 517 చెరువులు ఉన్నాయి. వీటిలో 174 చెరువులు పూర్తిగా, 125 చెరువులు పాక్షికంగా అంటే మొత్తం 299 చెరువులు నింపగలిగామన్నారు. మిగిలినవి ప్రాధాన్యత క్రమంలో ఫిబ్రవరి మాసానికల్లా నింపుతామన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు రెండోదశగా మడకశిర బ్రాంచ్ కాలువ పనులు అన్నీ పూర్తి చేసి హిందూపురం, మడకశిర, పెనుగొండ నియోజవర్గాలకు నీరిస్తామన్నారు. ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వర రావు, ఇఎన్‌సి నరసింహామూర్తి, ప్రాజెక్టు సిఇలు కబీర్ బాషా నాగరాజు, ఎస్ఇలు, ఇఇలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఓర్వకల్లులో రూ.100 కోట్లతో డ్రోన్ సిటీ

-గుట్టపాడులో 300 ఎకరాలు కేటాయింపు - డ్రోన్ పైలెట్ల శిక్షణ కూడా
-16న ప్రధాని మోడీతో శంకుస్థాపన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు సమీపంలో డ్రోన్ సిటీ ఏర్పాటుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా డ్రోన్ సిటీ ఏర్పాటుకు భూములను కూడా గుర్తించారు. ఇక్కడే డ్రోన్ పైలట్ల శిక్షణ కూడా ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. దేశంలోనే అతిపెద్ద డ్రోన్ సిటీ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమయింది. ఈనెల 16న గురువారం కర్నూలు జిల్లా పర్యటనకు రానున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఓర్వకల్లు సమీపంలోని డ్రోన్ సిటీ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నారు. గుట్టపాడు గ్రామం పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం 300 ఎకరాల భూమిని కేటాయించింది. రూ.100 కోట్లతో దీనిని అభివృద్ధి చేస్తారు.

ప్రధానంగా డ్రోన్ సిటీలో మానిఫ్యాక్చరింగ్ జోన్

యుఎవి తయారీ, అసెంబ్లీ లైన్లు, ప్లగ్-అండ్-ప్లే షెడ్‌లు, పరీక్ష అండ్ సందర్శన కేంద్రాలు ఏర్పాటు చేయనున్నాయి. వరల్డ్ లార్జెస్ట్ కామన్ డ్రోన్ టెస్టింగ్ ఫెసిలిటి, రిపేర్, మెయింటెనెన్స్, ట్రయినింగ్, డ్రోన్ మెంటెనెన్స్, రిపేర్ అండ్ ఓవరాల్ల్ సెంటర్లు, డ్రోన్ పైలట్లకు శిక్షణ కూడా ఇస్తారు.

ఇక్కడే స్టార్టప్ ఇన్‌క్యూబేషన్

పరిశోధన, అభివృద్ధి, స్టార్టప్‌లకు అవకాశం ఉంటుంది. 25,000 డ్రోన్ పైలెట్ల్‌కు శిక్షణ ఇవ్వనున్నారు. వ్యవసాయ, ఆరోగ్య, లాజిస్టిక్స్, అత్యవసర సేవల్లో డ్రోన్‌లను విస్తృతంగా ఉపయోగపడే విధానంలో డ్రోన్ సిటీ రూపకల్పన, పర్యావరణ పరిరక్షణ, మైనింగ్ తదితర రంగాల్లో ఉపయోగకరంగా ఉంటుంది.

'జిఎస్‌టి' మాయ..!

• అప్పుడు పిండుకుని.. ఇప్పుడు తగ్గించామంటూ ప్రగల్భాలు
• అదే అంశంపై మోడీ బహిరంగ సభ
• నేడు వామపక్షాల 'మోడీ గో బ్యాక్'



ఎన్‌డిఎ ప్రభుత్వం 2017లో ఒకే దేశం ఒకే పన్ను నినాదంతో జిఎస్‌టిని ప్రవేశపెట్టింది. నాలుగు శ్లాబులుగా పన్నులను విధించింది. ఎనిమిదేళ్ల పాటు జిఎస్‌టి పేరుతో ప్రజల నుంచి పన్నులను పిండుకున్నారు. తీరా ఇప్పుడు కొంత మేర తగ్గించి తామేదో గొప్ప ఊరట కల్పించినట్లు ప్రగల్భాలు పలుకుతున్నారు. సంబరాలు కూడా చేసుకుంటున్నారు. అందులో భాగంగా గురువారం కర్నూలు శివార్లలో సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈ సభలో పాల్గొని జిఎస్‌టి సంస్కరణలపై ప్రసంగించనున్నారు. రాష్ట్రానికి, జిల్లాకు ద్రోహం చేసిన మోడీ జిల్లా పర్యటనను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం మోడీ గో బ్యాక్ పేరుతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

మోడీ సారథ్యంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై మోయలేని భారాలు వేస్తూ వస్తోంది. అందులో భాగంగానే 2017 జులై 1 నుంచి ఒకే దేశం ఒకే పన్ను నినాదంతో జిఎస్‌టిని ప్రవేశపెట్టింది. నాలుగు శ్లాబులుగా పన్నులను విధించింది. 5, 12, 18, 28 శాతం శ్లాబులను ఏర్పాటు చేసి ఎనిమిదేళ్ల పాటు సామాన్యుల నుంచి పన్నుల రూపంలో వేల కోట్లు వసూలు చేశారు. ఇప్పుడు శ్లాబుల్లో మార్పులు చేసి రెండు శ్లాబులుగా ఏర్పాటు చేశారు. వస్తువుల ధరలపై జిఎస్‌టి తగ్గించామని ప్రగల్భాలు పలుకుతున్నారు. రాష్ట్రంలో సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ పేరుతో అవగాహన కార్యక్రమాలు, సంబరాలు నిర్వహిస్తున్నారు. కర్నూలు జిల్లాలో జీఎస్టీ పన్నుల తగ్గుదల వల్ల ప్రజలకు నెలకు సుమారు రూ.వెయ్యి వరకూ లాభంగా చేరుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కర్నూలు జిల్లాలో జీఎస్టీ తగ్గుదల తరువాత కూడా సామాన్యులకు సహజంగా ఊరట లేదా గట్టి లాభం అందలేదనే ఆవేదనలు ఉన్నాయి. జీఎస్టీ తగ్గింపు గురించి ప్రభుత్వం, అధికారులు అవగాహన ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ, ప్రాథమికంగా సరుకుల ధరల్లో స్పష్టమైన తగ్గుదల చుట్టుపక్కల ప్రజలకు ఎక్కువగా కనిపించట్లేదు. గతంలో రూ.100ల నెయ్యిపై 12 శాతం జిఎస్‌టి విధించడంతో దాని ధర రూ.112కు చేరింది. ఇప్పుడు 5 శాతానికి జిఎస్‌టి తగ్గించడంతో రూ.105కు తగ్గనుందని చెబుతున్నారు. అయితే అసలు జిఎస్‌టి లేకముందు కన్నా ఇప్పుడు రూ.5 అదనంగా వెచ్చించాల్సిన పరిస్థితే ఉంది. 2014లో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ అంతర్జాతీయ క్రూడాయిల్ ధరల ప్రకారం ఏ రోజు కూడా పెట్రోల్ ధరలు తగ్గించబడలేదు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరిగినప్పుడు మాత్రం పెట్రోల్ ధరలు పెంచి దర్జాగా పెట్రోలియం కంపెనీలు దండుకున్నాయి. వాస్తవంగా అంతర్జాతీయంగా ఉన్న క్రూడాయిల్ ధరలను అనుసరించి పెట్రోల్ ఒక లీటర్ దాదాపు రూ.75 లకే ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉన్నప్పటికి రూ.110లు ఉందంటే ఎంత దోపిడీ జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.. ఇవన్నీ సరిచేయకుండా ఎన్‌డిఎ ప్రభుత్వం జిఎస్‌టి 2.0 పేరుతో తగ్గింపులు చేశామని సంబరాలు చేసుకుంటూ ప్రచారాలకు దిగడం ప్రజలను నివ్వెరపరుస్తోంది. జిఎస్‌టి 2.0 అమల్లోకి వచ్చిన తరువాత ధరలు తగ్గినా ఇంకా పాత ధరలకే కొంత మంది అమ్ముతున్నట్లు సమాచారం. పేరుకే జిఎస్‌టి తగ్గింపు పేరుకే జిఎస్‌టి తగ్గించినారే తప్ప ఆచరణలో మాత్రం లేదు. కర్నూలు శివార్లలో సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ పేరుతో భారీ బహిరంగ సభను గురువారం నిర్వహించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈ సభలో పాల్గొని జిఎస్‌టి సంస్కరణలపై ప్రసంగించనున్నారు. రాష్ట్రానికి, జిల్లాకు ద్రోహం చేసిన మోడీ జిల్లా పర్యటనను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం మోడీ గో బ్యాక్ పేరుతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ నిరసన ర్యాలీ చేపట్టి కలెక్టరేట్ వద్ద నిరసన తెలపనున్నారు. ఈ నిరసనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో పాటు వామపక్ష పార్టీల నాయకులు పాల్గొననున్నారు. నంద్యాలలోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

'మోడీ గో బ్యాక్' నిరసనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఈనెల 16న సూపర్ జిఎస్‌టి సభ కోసం వస్తున్న నరేంద్ర మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ 15న జిల్లా పరిషత్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు జరిగే మోడీ గో బ్యాక్ నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని సిఐటియు న్యూ సిటీ అధ్యక్ష కార్యదర్శులు నగేష్, నరసింహులు, నగర ఉపాధ్యక్షులు టి.రాముడు, కోశాధికారి సాయిబాబా, విస్తృతంగా కార్మిక అడ్డాల లో ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ 2017 నుండి ఇప్పటిదాకా రూ.55 లక్షల కోట్లు జిఎస్‌టి వసూలు చేసి ఇప్పుడు సూపర్ జిఎస్‌టి అని రావడా నికి ఏమి అర్హత ఉందని ప్రశ్నించారు. రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలు, ప్రత్యేక హోదా ఇవ్వలేదని, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ఏమాత్రం నిధులు ఇవ్వని మోడీ ఏ మొహం పెట్టుకొని వస్తున్నారని ప్రశ్నించారు?. నరేంద్ర మోడీ తాత పుట్టకముందే కార్మికులు పోరాడి 8 గంటల పని విధానాన్ని సంఘం పెట్టుకునే హక్కును సాధించుకున్నామని తెలిపారు. అలాంటి హక్కులను లేబర్ కోడల పేరుతో అరించి వేశారని తెలిపారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం 13 పనిగంటల విధానానికి ఆమోదం తెలిపిందని, కార్మిక వర్గానికి నష్టం చేస్తున్న మోడీని వారి హక్కులను హరించేయడానికి కారణమైన నరేంద్ర మోడీ కర్నూలుకు వస్తున్న సందర్భంగా భారీ ఎత్తున నల్లజెండాలతో నిరసన తెలపాలన్నారు. మోడీ మిత్రుడు ట్రంపు సుంకాల వల్ల నష్టపోయిన పత్తి మొక్కజొన్న గోధుమ ఆక్వా రైతులు ఆటోమొబైల్, ఆభరణాలు రంగంలో నష్టపోతున్న ఏమాత్రం ప్రశ్నించకుండా మౌనంగా ఉన్నా మోడీ పర్యటన సందర్భంగా నిరసన తెలుపాలన్నారు. గతంలో రాష్ట్రానికి మూడుసార్లు వచ్చిన నరేంద్ర మోడీ వల్ల రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం జరగలేదన్నారు. ఇప్పుడైనా సరే కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి, కర్నూలు నుండి రాజధానికి ప్రతిరోజు రైళ్ల సౌకర్యాలు, 6 లైన్ల రోడ్డు మార్గాన్ని జిల్లా అభివృద్ధికి నిధులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు నగర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి : మంత్రులు

- కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



సమీక్షలో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

ఈనెల 16న జరిగే ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభలో విజయవంతం చేయాలని మంత్రులు అచ్చన్నాయుడు, ఎన్ఎండి ఫరూక్, సత్యకుమార్ యాదవ్‌లు పేర్కొన్నారు. మంగళవారం నన్నూరు, రాగమయూరి సమీపంలో ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రులు సమీక్షించారు. ఇప్పటివరకు జరిగిన పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమీక్షలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్, ఎమ్మెల్యేలు, బిజెపి జనసేన ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని బహిరంగ సభకు 3500 బస్సులు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

నన్నూరులో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు 3500 బస్సులు సిద్ధం చేసినట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కర్నూలు ఆయన ప్రధాని బహిరంగ సభ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈనెల 16న కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు నిరంతరం ఆర్‌టిసి ఏర్పాట్ల పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. శ్రీశైలం పర్యటన కోసం అదనంగా 150 బస్సులు ఏర్పాటు చేసామన్నారు. పోలీసులు, భద్రతా సిబ్బందికి రవాణా కోసం 80 బస్సులు కేటాయింపు చేసినట్లు పేర్కొన్నారు. పూర్తి ఫిట్‌నెస్ బస్సులను మాత్రమే వినియోగిస్తున్నామని మంత్రి వెల్లడించారు.

మోడీ సభకు 425 బస్సులు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూలుకు దేశ ప్రధాని మోడీ ఈనెల 16న కర్నూలుకు వస్తున్న సందర్భంగా ఉభయ జిల్లాల(కర్నూలు,నంద్యాల) ఆర్‌టిసి బస్సుల ద్వారా జనాన్ని సమీకరించేందుకు 425 బస్సులను పంపుతున్నట్లు కర్నూలు ఆర్ఎం టి.శ్రీనివాసులు మంగళవారం ప్రజాశక్తికి తెలిపారు. ఇందులో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులు కూడా ఉన్నాయని తెలిపారు. 425 మంది డ్రైవర్లు, 25 మంది కండక్టర్లు, బస్సుల డ్యూటీలకు 20 మంది పంపుతున్నట్లు ఆయన తెలిపారు. కర్నూలు నగరం నుండి 40 వేల మంది ప్రజలను సమీకరిస్తున్నట్లు అధికార వర్గాల సమాచారం. ప్రజలను సమీకరించే బాధ్యతను కర్నూలు పేదరిక నిర్మూలన విభాగం, మెప్మా, నగరపాలక సంస్థ సిబ్బంది తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈ పర్యటన సందర్భంగా కర్నూలు, నంద్యాల జిల్లాలలోని ప్రజలు 15, 16, 17 తేదీలలో ముఖ్యమైన పనులు ఉంటే తప్ప ప్రయాణం చేయకుండా ఉండటం ఉత్తమం. బస్సులు లేని కారణం చేత ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంటుంది.

33వ వార్డు కల్లూరులో తిష్ట వేసిన సమస్యలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : సిపిఎం ప్రతినిధి బృందం మంగళవారం 33వ వార్డు కల్లూరు, చెంచునగర్‌లో పర్యటించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప, నగర కమిటీ సభ్యులు హుస్సేన్‌బాష, పార్టీ సీనియర్ నాయకులు గోవిందు మాట్లాడుతూ స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో డ్రెయినేజీ కాలువలు పాడైపోయి నీళ్లు ఎక్కడికక్కడ నిలబడి పోతున్నాయని, వీధిలైట్లు సరిగ్గా వెలగడం లేదని, దీనివల్ల రాత్రి వేళలో స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అధికారులు అవసరాల రీత్యా స్థానికంగా వీధులలో రోడ్లు, కల్వర్టులు పగలగొట్టి వదిలేశారన్నారు. ఎన్నిసార్లు అధికారులకు అర్జీ పెట్టుకున్న స్పందించే పరిస్థితి లేదని ప్రజలు సిపిఎం దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. శాఖా కార్యదర్శి శ్రీనివాసులు, రామచంద్రుడు, రాము పాల్గొన్నారు.



బెన్నమ్మకు గోల్డెన్ నంది అవార్డు

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

కర్నూలుకు చెందిన బెన్నమ్మను మ్యాక్స్ గ్లోబల్ పౌండేషన్ వారు సౌత్ ఇండియా అవార్డ్స్ 2025లో భాగంగా గోల్డెన్ నంది అవార్డుతో సత్కరించారు. ఆమె సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో పని చేస్తున్నారు. హైదరాబాద్ తెలుగుయూనివర్సిటీలో నిర్వహించిన ఈకార్యక్రమంలో తెలంగాణ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, గద్దర్ కూతురు వెన్నెలక్క, ఎమ్మెల్సీ దయాకర్ తదితరుల చేతుల మీదుగా గోల్డెన్ నంది అవార్డు ఇచ్చి సత్కరించారు. ఈసందర్భంగా వెయ్యికిపైగా కవితులు, ఆరు పుస్తకాలు , పేపర్ ఆర్టికల్స్ సమాజానికి ఉపయోగపేవిందంగా ప్రచురించారని కొనియాడారు.

ప్రాజెక్టుల రూపశిల్పి సుబ్బరాయుడు ఇకలేరు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్ / కర్నూలు కార్పొరేషన్





సుబ్బరాయుడు భౌతికకాయానికి పూలమాలతో నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు పి.నిర్మల, పిఎస్.రాధాకృష్ణ, అంజిబాబు, రామకృష్ణ, ఆనంద్‌బాబు, రాజశేఖర్ , రాముడు, గురుశేఖర్

రాయలసీమ జిల్లాలోని పలు సాగునీటి ప్రాజెక్టుల ప్రణాళికకర్త, రూపశిల్పి,విశ్రాంత డిప్యూటీ ఇంజనీర్ ఎం.సుబ్బారాయుడు(76) మంగళవారం మృతి చెందారు. రాయలసీమలో ప్రాజెక్టుల ఆవశ్యకతను తెలియజేయడంతో పాటు ఆయన ప్రభుత్వ ఇంజనీరుగా పనిచేసిన కాలంలో అనేక ప్రాజెక్టుల నిర్మాణ ప్రణాళికలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించిన ఘనత ఆయనకే దక్కుతుంది. కేవలం ప్రణాళికలు రచించడమే కాకుండా వాటిని సాధించడం కోసం వివిధ ప్రజా సంఘాలను, హక్కుల నాయకుల చైతన్య పరిచి ప్రాజెక్టు సాధనకు సహకరించారు. కర్నూలు జిల్లాలో వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించిన డీటెయిల్స్ ప్రాజెక్టు రిపోర్టులను (డిపిఆర్) ఆయన స్వయంగా తయారుచేసి ప్రభుత్వానికి అందజేశారు. ఆయన ఒకనాటి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కలిగిరి మండలం, మహల్ గ్రామంలో జన్మించారు. ఉమ్మడి కడప జిల్లాలోని, చెన్నూరు గ్రామంలో ప్రాథమిక విద్య అభ్యసించారు. తిరుపతి ఎస్వి యూనివర్సిటీ నుంచి బిఇ పట్టాను పొందారు. రేణిగుంట, మండూరులో ఇంజనీరుగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన వివిధ రాష్ట్రాలకు కూడా సేవలు అందించారు. అందులో భాగంగా కర్ణాటక, గుజరాత్, మైలవరం డ్యామ్, శ్రీశైలం, గుత్తి, గుంతకల్లు ప్రాంతాల్లో ఇంజనీరింగ్ సేవలు అందించారు. 2005లో డిప్యూటీ ఇంజనీర్‌గా పదవి విరమణ పొందారు. రిటైర్మెంట్ తర్వాత కూడా ఆయన విశ్రాంతి తీసుకోలేదు. రాయలసీమ కరువు, కాటకాలకు శాశ్వత పరిష్కారం కోసం తన అనుభవాన్ని, శక్తిని, సమయాన్ని అంకితం చేశాడు. వేదవతి నదిపై డ్యామ్ రూపకల్పన, గుండ్రేవుల ప్రాజెక్టు- 54 టిఎంసిల నీటికి ప్రణాళిక డిపిఆర్ తీసుకెళ్లిన విజన్ ఉన్న ఇంజనీరుగా గుర్తింపు పొందారు. ఓర్వకల్ ఇండస్ట్రియల్ కారిడార్‌కు నీటి సరఫరా, రాఘవేంద్ర స్వామి ఆలయానికి నీటి ప్రమాదం లేకుండా ప్రొటెక్షన్ నిర్మాణం, ఆలయం చుట్టూ షాపులు పర్యాటక కేంద్రగా మారడానికి కృషి చేశారు. అనారోగ్యం రీత్యా 15 సంవత్సరాల క్రితం ఒక కాలు కోల్పోయి కదలలేని స్థితిలో ఉన్నప్పటికీ ఆయన ఆలోచనలు, కలలు, కృషి మాత్రం రాయలసీమ ప్రాజెక్టులపైనే ఎక్కువగా కేంద్రీకరించి పనిచేశాయి. ఆయనకు భార్య కుమారుడు, కూతురు ఉన్నారు.

సిపిఎం నివాళి : ఉద్యోగం అంటే వ్యక్తిగత జీవిత అవసరం కోసమని భావించే సమాజంలో, తన ఉద్యోగం వ్యక్తిగత జీవితమే కాదు, సమాజ అవసరమని భావించి ఆ సమాజంలో ప్రజలు పడే కష్టాలకు పరిష్కారం చూపించడమే అసలైన జీవితం అంటూ.. జీవిత చివర అంకం వరకు రాయలసీమ కన్నీటి కష్టాల కోసం పరితపించి పనిచేసిన శక్తి సుబ్బరాయుడుదని సిపిఎం నాయకులు కొనియాడారు. సుదీర్ఘ కాలం పాటు ఇంజనీర్‌గా పనిచేసిన సుబ్బరాయుడు భౌతికకాయాన్ని కర్నూలు నగరంలోని ధర్మపేట సూర్య అపార్టుమెంట్స్‌లో ఆయన నివాసం వద్ద సిపిఎం నాయకులు మంగళవారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుబ్బరాయుడు చూపిన మార్గంలో నీటి వనరుల సాధన కోసం సిపిఎంగా ఉద్యమిస్తామన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి. నిర్మల, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, జి రామకృష్ణ, ఎండి ఆనంద్ బాబు, టి.రాముడు, ఎండి అంజిబాబు, ఓల్డ్ సిటీ కార్యదర్శి రాజశేఖర్, జిల్లా నాయకులు నగేష్, గురు శేఖర్, రాఘవేంద్ర, నగర నాయకులు హుస్సేన్ బాషా పాల్గొన్నారు.

ఇంజనీర్ సుబ్బరాయుడు మృతి తీరని లోటు
- ఎపి రైతుసంఘం నివాళి

కర్నూలులో నివాసం ఉంటున్న విశ్రాంత ఇంజనీర్ సుబ్బరాయుడు మరణం రాయలసీమ ప్రాంత రైతాంగానికి ముఖ్యంగా ఉమ్మడి కర్నూలు జిల్లా రైతాంగానికి తీరని లోటు అని భావిస్తున్నామని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సుబ్బరాయుడు ఇరిగేషన్ శాఖలో వివిధ హోదాల్లో పని చేశారు. ఉద్యోగం నుండి రిటైర్ అయిన తర్వాత విశ్రాంత జీవితాన్ని అందరిలాగా కుటుంబం కోసం వెచ్చించడం కాకుండా ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల రూపకల్పనకు, సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి వెచ్చించిన గొప్ప వ్యక్తిగా రైతు సంఘం భావిస్తున్న దన్నారు. ఆయన కృషి చరిత్రలో చిరస్థాయిగా ఉంటుందన్నారు. ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పక్షాన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పుల్లా రామాంజనేయులుకు వేదగిరి రాంబాబు పురస్కారం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్ : హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన సాహిత్య కార్యక్రమంలో డాక్టర్ వేదగిరి రాంబాబు సాహిత్యపురస్కారాన్ని కర్నూలుకు చెందిన పుల్లారామాంజనేయులు మంగళవారం అందుకున్నారు. పురస్కారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారుడు కెవి రమణాచారి , ప్రముఖ కథా రచయితలు విహారి, సింహప్రసాద్, సుధామ, వాణిశ్రీ, వేదగిరి రాంబాబు కుటుంబ సభ్యులు సమక్షంలో బాలబంధు పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఈ పురస్కారాన్ని సింహప్రసాద్ సాహిత్య సంస్థ ప్రతి ఏటా బాలసాహిత్యంలో విశేషంగా కృషి చేసిన వారికి పురస్కారంతో పాటు రూ.5000 నగదును ఇస్తారు.



కెవి.రమణాచారితో పురస్కారం అందుకుంటున్న పుల్లా రామాంజనేయులు

డిజిపిని కలిసిన కర్నూలు ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



ఈనెల 16న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కర్నూలు పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట పై మంగళవారం రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా కర్నూలు నగరంలోని బి.క్యాంప్ దగ్గర ఉన్న పోలీసు అతిథి గహం చేరుకున్నారు. ఈ సందర్భంగా కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ , డిజిపి ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందచేశారు.



పాణ్యం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవి కుమార్

ప్రధాన మంత్రి మోడీ పర్యటనను విజయవంతం చేద్దాం

-మంత్రి గొట్టిపాటి రవి కుమార్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. మంగళవారం మాధవినగర్ పాణ్యం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అధ్యక్షతన పాణ్యం నియోజకవర్గ కూటమి పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. నన్నూరు రాగ మయూరిలో 16న ప్రధాని సభకు మండలాలు, గ్రామస్థాయి, అర్బన్ వార్డులలో పెద్దఎత్తున తరలివచ్చి మోడీ సభ విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా టిడిపి సీనియర్ నాయకులు నందికొట్కూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి గౌరు వెంకట రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తమూల అశోక్ రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్త చైతన్య రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు చింతాసురేష్, బిజెపి నాయకులు శ్రీకాంత్ రెడ్డి, సింగం సోమశేఖర రెడ్డి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు డి.రామాంజనేయులు, మంజునాథ్, పిబివి సుబ్బయ్య పాల్గొన్నారు.

రెండు రోజులపాటు విద్యాసంస్థలకు సెలవు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఈనెల 16న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన నేపథ్యంలో బుధ, గురువారాలు జిల్లాలో ఉన్న పాఠశాలలు ఇంటర్మీడియట్ కళాశాలలకు సెలవు ప్రకటిస్తూ విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ ఆర్ఐఒ లాలప్ప మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ , ప్రైవేటు జూనియర్ కళాశాలలకు రెండు రోజులు సెలవు ప్రకటించినట్లు ఆర్ఐఒ వెల్లడించారు. కర్నూలు అర్బన్ , కర్నూల్ రూరల్ కల్లూరు ఓర్వకల్ మండల పరిధిలోని పాఠశాలలకు మాత్రమే సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పేర్కొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పంటలకు మద్దతు ధర ఇవ్వాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని రూరల్

పత్తి, వేరుశనగ పంటలకు మద్దతు ధరలు అమలు చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. మంగళవారం రైతుసంఘం ఆధ్వర్యంలో మార్కెట్ యార్డు కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశులు, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య మాట్లాడారు. వారం రోజులుగా వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి పత్తి, వేరుశనగ పంట ధరలను క్వింటాకు రూ.500 నుంచి రూ.1000 తగ్గించి వేశారని తెలిపారు. వేరుశనగ, పత్తి కనిష్ఠ ధర రూ.4 వేలలోపే ఉందని చెప్పారు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, కూలీలు, విత్తనాల ఖర్చు కూడా రావడం లేదని తెలిపారు. సిసిఐ, మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్ తదితర ప్రభుత్వ సంస్థల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో వడ్డీ దోపిడీ, తూకాల్లో దోపిడీ అధికమైందని, పత్తి దిగుమతులను నిషేధించాలని కోరారు. పత్తి టెండర్లు మధ్యాహ్నం 2 గంటల్లోపే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యదర్శి గోవిందుకు వినతి పత్రం అందజేశారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, రైతు సంఘం జిల్లా నాయకులు ఈరన్న, వీరేష్, బాషా, హనుమంతు, నాయకులు ఎల్లయ, హనుమంతు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయండి

- రాష్ట్ర మంత్రి సవిత


మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-ఆలూరు

ఈ నెల 16న ఉమ్మడి జిల్లాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటనకు నియోజకవర్గ ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్ర బీసీ వెల్ఫేర్, చేనేత శాఖ మంత్రి సవిత కోరారు. మంగళవారం ఆలూరులోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ ఆవరణలో నియోజకవర్గ ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి అధ్యక్షతన నియోజక వర్గ కూటమి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత, ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొనే బహిరంగ సభకు నియోజకవర్గంలోని గ్రామ, మండల కేంద్రాల నుంచి తరలి రావాలని కోరారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, ఆలూరు అగ్రికల్చర్ గంజి నాగరాజు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బొజ్జమ్మ, శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ సత్తిబాబు, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, బిజెపి నాయకులు వెంకట్రాముడు, జనసేన నాయకులు రంజిత్ పాల్గొన్నారు.

మోడీ సభకు భారీగా తరలిరావాలి

- ఎమ్మెల్యే పార్థసారథి, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని


వివరాలు వెల్లడిస్తున్న నాయకులు

ఈనెల 16న కర్నూలులో జరిగే ప్రధానమంత్రి మోడీ సభకు భారీగా తరలి రావాలని ఎమ్మెల్యే పార్థసారథి, టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప కోరారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ, రవాణా, భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం 7 గంటలకు బయల్దేరి ఆరేకల్ గ్రామ సమీపంలో టిఫిన్ ఏర్పాటు చేశామన్నారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 12 గంటలకు కర్నూలు ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్ సమీపంలోని రాగమయూరి వెంచర్ వద్ద జరుగనున్న ప్రధానమంత్రి సభకు చేరుకోవడానికి ఏర్పాట్లు చేశామన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు తిమ్మప్ప, మండల అధ్యక్షులు శివప్ప, జనసేన పట్టణ అధ్యక్షులు వేణు వర్మ, టిడిపి సీనియర్ నాయకులు రామస్వామి, యువ నాయకులు భూపాల్ చౌదరి, మారుతి నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, లక్ష్మీనారాయణ, జయరామ్, రవి, తిరుమలేష్, బసవరాజు, ప్రతాప్ రెడ్డి, నాగరాజు, శివ, సుబ్బు, గిడ్డి శంకర్, ఉపేంద్ర, నాగరాజు గౌడ్, జనసేన నాయకులు రాజశేఖర్, నెల్లిబండ రాజశేఖర్, శీన, తరుణ్ కుమార్ ఉన్నారు.

పెట్టుబడి భారం..!

- అంతకంతకు పెరిగిపోతున్న పెట్టుబడులు
- మండలంలో అధిక శాతం పప్పు శనగ సాగు
- ఒక ఎకరా విత్తుకు రూ.10 వేలు ఖర్చు

ప్రజాశక్తి - చిప్పగిరి

వ్యవసాయం మీద ఆధారపడే రైతులకు ప్రతేడాది పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయి. రాబడి కన్నా అప్పులే ఎక్కువ అవుతున్నాయి. చిప్పగిరి మండలంలో పప్పు శనగను ఎక్కువ మోతాదులో సాగు చేస్తున్నారు. ఒక ఎకరంలో పప్పు శనగ విత్తనం వేసేందుకు రూ.10 వేల వరకు ఖర్చు అవుతోంది. ఇక సేద్యాలు, నీళ్ల మందులు, కూలీలకు మరో రూ.10 వేలు అవుతోందని రైతులు పేర్కొంటున్నారు.


విత్తనం వేస్తున్న రైతులు

చిప్పగిరి మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసే ప్రధాన పంట పప్పు శనగ. ఈ పంట అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. మండలంలో మొత్తం విస్తీర్ణం దాదాపు 74,157 ఎకరాలు ఉన్నట్లు వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. మండలంలో ప్రధానంగా రేగడి పొలం ఎక్కువగా ఉంది. ఈ పొలంలో మిరప, పత్తి, జొన్న పంటల తర్వాత ఎక్కువ పండించేది పప్పు శనగే. మండలంలోని ప్రతి గ్రామంలోనూ పప్పు శనగ పంటపైనే అధిక శాతం రైతులు ఆధారపడ్డారు. ఈ ఏడాది పప్పు శనగ పంట ఒక ఎకరాలో సాగు చేసేందుకు దాదాపు రూ.10 వేల పెట్టుబడి అవుతోందని అంచనా. విత్తనాలు, ట్రాక్టర్ల బాడుగ, మందు సంచులు, కూలీలతో కలిపి పెట్టుబడులు భారీగా పెరిగాయని రైతులు పేర్కొంటున్నారు. విత్తనం వేసిన 15 రోజుల నుంచి నీళ్ల మందుల ఖర్చులు, వాటిలో సేద్యాలకు మరింత పెట్టుబడి పెట్టాల్సి ఉంది. ప్రతి సంవత్సరం పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయి. పంట రాబడి చూస్తే ప్రతేడాది తగ్గిపోతూనే ఉంది. వర్షాలు ఎక్కువ కురవడం లేదా వర్షాలు లేక ఏదో ఒక రకంగా అనావృష్టి, అతివృష్టితో పంటలు దెబ్బతింటూనే ఉన్నాయి. ఈ మధ్యకాలంలో ఏనాడూ పరిపూర్ణంగా మంచి పంటలు పండించిన దాఖలాలు లేవు. ప్రతేడాది పంటల రాబడి తీసి వేసే అప్పు మిగులుతోందని రైతులు వాపోతున్నారు. గతంలో భారీ వర్షాల వల్ల పప్పు శనగ సాగు చేసే రైతులందరూ నష్టపోయారు. ఈ నేపథ్యంలో మళ్లీ తుపాను వస్తే వేసుకున్న పప్పు శనగ పంటలన్నీ ఎక్కడ నష్టమవుతామోనని రైతులు దిగాలు చెందే పరిస్థితి నెలకొంది. రూ.వేలకు వేలు పెట్టుబడులు పెడుతున్న రైతులు వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటాయోనని, పంటలు చేతికొస్తాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగు చేసిన పంటలన్నీ మంచి దిగుబడులు వచ్చి ఆ ధాన్యమంతా ఇంటికి చేరినప్పుడు మాత్రమే ఆ రైతుకు సంతోషం.

పెట్టుబడులు పెరుగుతూనే ఉన్నాయి

- రైతు వెంకటేశ్వర్లు, నేమకల్లు గ్రామం



ఏటేటా, ఏడాదికి పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయి. ఒక ఎకరాలో విత్తనం వేసుకోవడానికి దాదాపు రూ.10 వేలు పెట్టుబడి అవుతోంది. విత్తనం వేసిన తర్వాత అదనంగా మళ్లీ నీళ్ల మందులు, సేద్యాలు, కలుపులు, పంట నూర్పిడికి రూ.10 వేలు ఖర్చు అవుతోంది. ఇంత పెట్టుబడులు పెట్టిన తర్వాత కనీసం ఒక ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తేనే ఆ రైతుకు గిట్టుబాటు అవుతుంది.

ప్రకృతి వ్యవసాయంపై ఆధారపడాలి

- ఎఒ శ్రీరామ్ ప్రవీణ్



రైతులు ప్రతేడాది సాగు చేసిన పంటలనే మళ్లీ వేయడం మంచిది కాదు. పంట మార్పిడి తప్పనిసరిగా చేసుకోవాలి. మండలంలో పప్పు శనగ సాగు చేసే రైతులు ఎక్కువ ఉన్నారు. ప్రతేడాది ఇదే పప్పు శనగ విత్తనం వేస్తే ఆ పొలంలో ఎక్కువగా రకరకాల తెగుళ్లు సోకే ప్రమాదం ఉంది. ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయంపైనా, కృత్రిమ ఎరువులపైనా అవగాహన పెంచుకొని పాటిస్తే పెట్టుబడులు లేని పంటలు పండించుకోవచ్చు.


బీవీని సన్మానిస్తున్న నాయకులు

మోడీ సభకు 20 వేల మంది

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రధాని మోడీ సభకు ఎమ్మిగనూరు నుంచి 20 వేల మందిని తరలిస్తున్నట్లు ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో మోడీ సభకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ... ఈనెల 16న కర్నూలులోని రాగమయూరి వెంచర్‌లో జరిగే మోడీ సభకు జనసమీకరణ, బస్సులు, వాహనాల ఏర్పాట్లపై చర్చించారు.

ఆలూరులో ఫ్లెక్సీ రగడ

- తన ఫ్లెక్సీని చించారని గుంతకల్ ఎమ్మెల్యే చిందులు

ప్రజాశక్తి -ఆలూరు

పట్టణంలో కొద్దిరోజులుగా స్తబ్ధుగా ఉన్న రాజకీయ వేడి మంగళవారం ఫ్లెక్సీ రగడతో వేడెక్కింది. గెస్ట్ హౌస్ పక్కన అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించారంటూ స్టేషన్ ఎదురుగా ఉన్న దుకాణంలో టిడిపి నాయకుని కుమారునిపై గుంతకల్ ఎమ్మెల్యేయ గుమ్మనూరు జయరామ్ చిందులు తొక్కారు. తన ఫ్లెక్సీని చించేంత ధైర్యం ఉందా అంటూ దుర్భాషలాడారు. తాము బ్యానర్ చించలేదని ఎంత చెప్పినా వినకుండా పరుష పదజాలంతో ధూషించారు. ఎంత చెప్పినా జయరామ్ వినకపోవడంతో టిడిపి నాయకుని కుటుంబసభ్యులు కూడా 'నీ జులుం ఏమిట'ంటూ ప్రతిఘటించినట్లు తెలిసింది. అంతలోనే స్థానికంగా ఉన్న పోలీసులు జోక్యం చేసుకోవడంతో సద్దుమణిగింది. జయరామ్ అనుచరులు చించిన ఫ్లెక్సీ స్థానంలో కొత్త ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.

మున్సిపల్ పాఠశాలలకు మొండిచేయి

- ఎంటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ హైస్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోందని, డీఎస్సీ ద్వారా కేటాయింపు జరుగుతుందని ఆశించినా మొండిచేయి చూపారని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు అనిల్ కుమార్, జంగం బసవరాజు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు మంగళవారం ఫెడరేషన్ తరపున ఆహ్వానం పలికారు. వారు మాట్లాడుతూ... డీఎస్సీ నియామకాల్లో మున్సిపల్ పాఠశాలలకు తీవ్ర నిరాశను మిగిల్చిందని, పోస్టుల కేటాయింపులో అన్యాయం జరిగిందని తెలిపారు. డీఎస్సీలో నూతన ఉపాధ్యాయులు వస్తారని ఆశగా ఎదురు చూసినా నిరాశే మిగిలిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. నెహ్రూ స్మారక పురపాలక ఉన్నత పాఠశాలకు ఒక్క హిందీ స్కూల్ అసిస్టెంట్, వ్యాయామ ఉపాధ్యాయులు కూడా లేరని, అధికారులు గమనించకపోవడం శోచనీయమని తెలిపారు. కల్లుబావి మున్సిపల్ ఉన్నత పాఠశాల, కిల్చిన పేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోందని చెప్పారు. నాయకులు ఎల్లాగి, నాగేశ్వర నాయుడు, భాస్కర్ ఆచారి కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికి, మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌పై అవగాహన కల్పించారు.


ఉపాధ్యాయులకు ఆహ్వానం పలికిన నాయకులు


నివాళులర్పిస్తున్న టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్

టిడిపి మండల కన్వీనర్‌కు మాతృవియోగం

- ప్రజాప్రతినిధుల నివాళి

ప్రజాశక్తి - చిప్పగిరి

టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలీ తల్లి హుస్సేన్ బీ (88) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులు మంగళవారం లాయర్ షేక్షావలీ స్వగ్రామం నేమకల్లులోని నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. ఎమ్మెల్యే బి.విరుపాక్షి, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి భర్త, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్‌లు హుస్సేన్‌బీ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైకుంఠం శివప్రసాద్ మాట్లాడుతూ... బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మండలంలోని టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆలూరు కోర్టులో విధులు నిర్వహించే లాయర్లు హుస్సేన్‌బీ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న విద్యాకమిటీ చైర్మన్

ప్రజాశక్తి - మంత్రాలయం

తుంగభద్ర నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాను ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి విద్యా కమిటీ ఛైర్మన్ గనేకంటి గురురాజ అడ్డుకున్నారు. మంగళవారం స్థానిక సంత మార్కెట్ వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ముందు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లను విద్యార్థులు, ఉపాధ్యాయులు, కాలనీ వాసులు ఎద్దుల బండిని అడ్డుపెట్టి మరీ అడ్డుకున్నారు. గురురాజ మాట్లాడుతూ... తుంగభద్ర నది నుంచి రోజూ సుమారు 30 ట్రాక్టర్లు పాఠశాల, అంగన్వాడీ కేంద్రం మీదుగా ఇసుకను తరలిస్తున్నారని, వేగంగా నడుపుతుండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయులు, విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. ఇసుక ట్రాక్టర్లు రాకూడదని ఎన్ని సార్లు చెప్పినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ అడ్డుకున్న వారిపై దాడులకు పాల్పడేందుకు సాహసిస్తున్నారని పేర్కొన్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు వచ్చి ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కొద్ది సేపటికే వదిలేశారని తెలిపారు. పాఠశాల ముందు ఇసుక ట్రాక్టర్లు తిరగకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకున్న ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్

ప్రతిఒక్కరికీ జీవిత బీమా అందించాలి

- ఎల్ఐసి కడప డివిజన్ సీనియర్ మేనేజర్ రవికుమార్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రతి వ్యక్తికీ జీవిత బీమా అందించాల్సిన బాధ్యత ఎల్ఐసిపై ఉందని ఎల్ఐసి కడప డివిజన్ సీనియర్ మేనేజర్ జికెఆర్‌వి.రవికుమార్ తెలిపారు. మంగళవారం ఎల్ఐసి బ్రాంచి కార్యాలయంలో ఎల్ఐసి ఏజెంట్ల సమావేశం నిర్వహించారు. బ్రాంచి మేనేజర్ పులి నాయక్ అధ్యక్షత వహించారు. ముందుగా ఎమ్మిగనూరు ఎల్ఐసి బ్రాంచి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన పోటీల్లో అత్యధిక పాలసీలు, అత్యధిక ప్రీమియం చేసిన ఏజెంట్ల పేర్లతో కూడిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎల్ఐసిలో పెట్టే ప్రతి పైసా సురక్షితమైందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. కొత్తతరం ఉద్యోగులు షేర్ మార్కెట్‌తో కూడిన పాలసీలు ఇష్టపడుతున్నారని చెప్పారు. ఎల్ఐసి కడప డివిజన్ మార్కెటింగ్ మేనేజర్ పి.శ్యాంసుందర్, మేనేజర్ సేల్స్ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ... ఎల్ఐసిలో కొత్తదనాన్ని ఏజెంట్లు అందుకోవాలని, దాని ద్వారా మార్కెట్‌లో నిలదొక్కుకుంటారని తెలిపారు. అనంతరం ఏజెంట్లను సన్మానించారు. సింగిల్ ప్రీమియంలో రూ.80 లక్షలు తెచ్చిన ప్రసాద్ స్వామిని సన్మానించారు. అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ సంతోష్ కుమార్, పత్తికొండ శాటిలైట్ బ్రాంచి మేనేజర్ మధుసూదన్, కడప ఎల్ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్ అసోసియేషన్ అధ్యక్షులు పి.తిమ్మారెడ్డి, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు రాజేష్, మధుసూదన్, లియాఫీ కడప డివిజన్ అధ్యక్షులు జయభారత్ రెడ్డి, లియాఫీ జోనల్ డివిజనల్ బ్రాంచి నాయకులు రమేష్, ప్రభాకర్ రెడ్డి, జయన్న, వీరేష్, అనంత భూరళి, ఆంధ్రయ్య, హరినాథ్, జెకె.శివరాముడు, జయరాముడు, రాజగోపాల్ శెట్టి, సూర్యకాంత్ రెడ్డి, సత్య రెడ్డి, అబ్దుల్ గఫూర్, మల్లికార్జున్ గౌడ్, బ్లీస్ యూనియన్ నాయకులు వెంకటేశ్వర రెడ్డి, రంగస్వామి, రామాంజనేయులు, శేషాద్రి, కృష్ణారెడ్డి, షబ్బీర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

'నాడు-నేడు'లో అవకతవకలు

- ఎఇ లక్ష్మన్నపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలి
- గార్లదిన్నె గ్రామస్తుల డిమాండ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

గతంలో పెసలదిన్నె పంచాయతీ పరిధిలో ఉన్న గార్లదిన్నెలో 'నాడు-నేడు' పనుల్లో అవకతవకలు చేసిన ఎఇ లక్ష్మన్నను సస్పెండ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. మంగళవారం నాసిరకంగా చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని గార్లదిన్నె గ్రామంలో రెండేళ్ల నుంచి పర్మినెంట్ హెచ్ఎం లేకపోయే సరికి ఎఇ లక్ష్మన్న అరకొర పనులు చేయించి అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. పాఠశాలలో దాతలు ఇచ్చిన ఫ్యాన్లు, ఇతర సామగ్రిని మాయం చేశారని, బాత్‌రూములు, వంట గదికి ఎలాంటి డోర్లు ఏర్పాటు చేయకుండా, టైల్స్ అతికించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించి, బిల్లులు చేసుకొని స్వాహా చేశారని మండిపడ్డారు. గతంలో తాము నిలదీయగా.. 'డబ్బులు ఖాతాలో ఉన్నాయి. పాఠశాల పనులు పూర్తి చేస్తాన'ని కల్లబొల్లి మాటలు చెప్పి ఉన్నదంతా దోచుకొని కులమాల గ్రామానికి బదిలీ చేయించుకున్నారని తెలిపారు. ఆయనకు ఫోన్ చేస్తే స్పందించడం లేదని చెప్పారు. కొత్తగా వచ్చిన ఎఇని ప్రశ్నించగా.. 'నాకు ఎలాంటి సంబంధమూ లేద'ని చేతులెత్తేశారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేయించి ప్రస్తుతం కులమాలలో పని చేస్తున్న ఎఇ లక్ష్మన్న సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే తమ పాఠశాల కోసం ఉద్యమానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు. గ్రామస్తులు ఏలీషా, పౌలు, తిమ్మ గురుడు, చిన్న రాముడు, సురేష్, ఆనంద్ పాల్గొన్నారు.


నాసిరకం పనులు చూపుతున్న గ్రామస్తులు

ఉరుకుందలో వేలం పాటలు

ప్రజాశక్తి - కౌతాళం


వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

జిల్లాలో ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దేవాలయం డిప్యూటీ కమిషనర్ వాణి మంగళవారం వేలంపాటలు నిర్వహించారు. స్వామి వారి భక్తులు సమర్పించిన అల్యూమినియం గుర్రాలు, కోర మీసాలు, కనుగుడ్లు, పాత ఇనుప సామాన్లు, నెయ్యి నూనె ఖాళీ డబ్బాలు, ఖాళీ పెరుగు బకెట్లు, ప్లాస్టిక్ వస్తువులకు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఇందులో ప్లాస్టిక్ వస్తువులు కిలో రూ.10కు, పాత ఇనుప సామాన్లకు కిలో రూ.32కు, నెయ్యి నూనె ఖాళీ డబ్బాలు ఒక్కొక్కటి రూ.20లకు పాటదారులు దక్కించుకున్నారు. అవుట్‌సోర్సింగ్‌కు షీల్డ్ ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించగా, ముగ్గురు షీల్డ్ టెండర్లు వేయగా, నలుగురు ఆన్‌లైన్ ద్వారా టెండర్లు వేశారు. ఇందులో ఇద్దరు పాటదారులు ఒకే ధరకు వేయడంతో రద్దు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. ఐమాక్స్ విద్యుద్దీపాలకు ఒకే టెండర్ రావడంతో అది కూడా రద్దు చేసినట్లు చెప్పారు. రద్దయిన టెండర్లకు మళ్లీ ఆహ్వానిస్తామని అధికారులు తెలిపారు. ఆ వివరాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. సూపరిటెండెంట్లు మల్లికార్జున, వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్లు కిరణ్, కుమార్, వీరేష్, విజయ్ కుమార్, గ్రామ నాయకులు కురుగోడు, నరసన్న, చిరంజీవి, మహాదేవ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జడ్‌పి విద్యార్థులు

- ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు విఠోభరావు

ప్రజాశక్తి - మంత్రాలయం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు విఠోభరావు తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను మంగళవారం ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్నూలు నగరంలోని కర్నూలు ఫర్‌మెన్ (బాయ్స్) డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో జరిగిన అండర్-14, 17 బాలబాలికల స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ ఎంపిక పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని తెలిపారు. అండర్-14లో 8వ తరగతి చదువుతున్న నందిని, శాంతి, ఖాజాలు ఎంపిక కాగా, అండర్-17 విభాగంలో పదో తరగతి చదువుతున్న రాధమ్మ, శైలజ, రామానాయుడు, రాజశేఖర్‌లు ఎంపికైనట్లు చెప్పారు. ఉపాధ్యాయులు, చంద్రశేఖర్, బసవరాజు, వీరేష్ రావు, రవీంద్ర, హరి, ధనుంజయ, పీడీ రవీంద్ర, పిఇటి నరసింహరాజు, లక్ష్మీదేవి, యశోద, సుల్తానాలు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి నవంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటి జాతీయ స్థాయిలోకి అడుగు పెట్టాలని ఆకాంక్షించారు.


విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

క్రీడల్లో గెలుపోటములు సహజం

- సర్పంచి తెల్లబండ్ల భీమయ్య

ప్రజాశక్తి - మంత్రాలయం


క్రీడాకారులు గెలుపోటములను సమానంగా, స్నేహపూర్వకంగా స్వీకరించాలని సర్పంచి, వైసిపి మండల ఉపాధ్యక్షులు తెల్లబండ్ల భీమయ్య తెలిపారు. మంగళవారం రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు స్థానిక హెలిప్యాడ్ మైదానంలో దీపావళి పండగ సందర్భంగా భీమా యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలను భీమయ్య, వైసిపి నాయకులు గుడేకల్లు మారెప్పతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాంపురం రెడ్డి సోదరులు ఎప్పుడూ ముందుంటారని తెలిపారు. ప్రతేడాది భీమా యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ జరగడం.. అందులో ఉత్సాహంగా పాల్గొనడం చూస్తున్నామని చెప్పారు. క్రికెట్ పోటీల్లో విన్నర్‌కు రూ.30 వేలు, రన్నర్‌కు రూ.20 వేల నగదుతో పాటు ట్రోఫీలను అందజేస్తామని తెలిపారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. నిర్వాహకులు బాలు, ఈశ్వర్ పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సర్పంచి భీమయ్య

బీసీ హాస్టల్ నిర్మాణానికి చర్యలు

- టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్

ప్రజాశక్తి - దేవనకొండ


వినతిపత్రం అందిస్తున్న విజయ భాస్కర్ గౌడ్

బీసీ హాస్టల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ కోరారు. మంగళవారం ఆలూరులోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశానికి హాజరయిన రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత శాఖ మంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హాస్టల్ నిర్మాణం జరిగితే దేవనకొండ చుట్టుపక్కల గ్రామాల్లో వలసలను నివారించి విద్యాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. అలాగే మండలంలో మోడల్ స్కూల్ నిర్మాణం గురించి వివరించారు.

ఆత్మవిశ్వాసం, పట్టుదల అవసరం

- సాఫ్ట్ స్కిల్ ట్రైనర్, మాస్టర్ మోటివేటర్ గౌతమి

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థుల్లో నేర్చుకోవాలన్న పట్టుదల, ఆత్మవిశ్వాసం అవసరమని సాఫ్ట్ స్కిల్ ట్రైనర్, మాస్టర్ మోటివేటర్ గౌతమి తెలిపారు. మంగళవారం పట్టణంలోని కిడ్డీస్ గ్లోబల్ రూట్స్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరుకోవడానికి ప్రణాళిక వేసుకోవాలని, అప్పుడే విజయం సాధించగలుగుతారని తెలిపారు. విజయవంతమైన వ్యక్తుల జీవితాలను ప్రేరణగా తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. పలు విషయాలపై అవగాహన కల్పించారు. కిడ్డీస్ రూట్స్ సంస్థల అధినేతలు కేశవ నారాయణ రెడ్డి, చిన్నపరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరు బాట : సిపిఎం

ప్రజాశక్తి - ఆస్పరి

ప్రజా సమస్యలపై ఈ నెల 16న మండలంలోని 33 గ్రామాల్లో పోరు బాట చేపడుతున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలు తిష్టవేశాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా పరిష్కరించడం లేదని తెలిపారు. జిల్లాలో ఆలూరు తాలూకా అత్యంత వెనుకబడిన ప్రాంతమని, నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేలు, మంత్రులు అయినప్పటికీ అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. తాగు, సాగునీటి కోసం ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు స్పందించి వేదవతి ప్రాజెక్ట్ మ్యాప్‌లోకి ఆస్పరి మండలాన్ని చేర్చాలని డిమాండ్ చేశారు. 15న జరిగే 'మోడీ గో బ్యాక్' నిరసనను జయప్రదం చేయాలని కోరారు. 22న సచివాలయాల ముందు చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని తెలిపారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు మల్లేష్, రంగస్వామి, ఈరన్న, రంగముని పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

ప్రధాని పర్యటన సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

జిల్లా ప్రజలు సహకరించాలి : ఎస్పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఈనెల 16న భారత ప్రధానమంత్రి కర్నూలుకు వస్తున్న సందర్భంగాఉదయం నుండి సాయంత్రం వరకు కర్నూలు మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్ళవలసిన వాహనాలకు ట్రాఫిక్ మళ్లింపు ఈ క్రింద విధంగా ఉంటుందని , ప్రజలు సహకరించాలని కర్నూలు ఎస్పి విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు. కడప నుండి కర్నూలు మీదుగా హైదరాబాదు వైపుకు వెళ్లే వాహనాలు. పాణ్యం, గడివేముల, మిడ్తూరు, బ్రాహ్మణ కొట్కూరు, కోల్లబాపురం, పూడూరు, అలంపూర్ బ్రిడ్జి, అలంపూర్ చౌరస్తా నుండి హైదరాబాదు వైపు వెళుతాయన్నారు. కడప నుండి కర్నూలు వైపు వెళ్ళే వాహనాలు. పాణ్యం, మిడ్తూరు, నందికొట్కూరు, కోల్లబాపురం, పూడూరు, అలంపూర్ బ్రిడ్జి, అలంపూర్ చౌరస్తా నుండి కర్నూలు కు చేరుకుంటాయన్నారు. నంద్యాల నుండి బెంగళూరు వైపు వెళ్ళే వాహనాలు. పాణ్యం, బనగానపల్లె, ఎన్.రాచర్ల, డోన్, బెంగళూరు వెళ్తాయన్నారు. పాణ్యం, తమ్మ రాజుపల్లె, బేతంచెర్ల, డోన్, బెంగళూరు, సోమయాజుల పల్లె, బేతంచెర్ల, డోన్, బెంగళూరు. శ్రీశైలం నుండి కర్నూలు రోడ్డు ఆత్మకూరు నుండి అనంతపురం వైపు వెళ్ళు వాహనాలు ఆత్మకూరు – బండి ఆత్మకూరు, పాణ్యం, బనగానపల్లె, ఎన్.రాచర్ల, డోన్, అనంతపురం మీదుగా వెళతాయన్నారు. ఆత్మకూరు నుండి బళ్ళారి వైపు వెళ్ళు వాహనాలు ఆత్మకూరు – బ్రాహ్మణకొట్కూరు, కోల్లబాపురం, పూడూరు, ఆలంపూర్ బ్రిడ్జి ఆలంపూర్ చౌరస్తా, శాంతినగర్, బళ్ళారి మీదుగా వెళతాయన్నారు. అనంతపురం నుండి హైదరాబాదు వైపు వెళ్ళు వాహనాలు. గుత్తి– జొన్నగిరి, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి, ఆదోని, మంత్రాలయం, మాధవరం, రాయచూరు, హైదరాబాదు మీదుగా వెళతాయన్నారు. గుత్తి – జొన్నగిరి, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి, ఆదోని, ఎమ్మిగనూరు, నందవరం, నాగలదిన్నె, ఐజ, హైదరాబాదు మీదుగా వెళతాయన్నారు. అనంతపురం నుండి నంద్యాల వైపు వైపు వెళ్ళు వాహనాలు. అనంతపురము – ప్యాపిలి, ఎన్.రాచర్ల, బనగానపల్లె, పాణ్యం, నంద్యాల డోన్ – బనగానపల్లె, నంద్యాల మీదుగా వెళతాయన్నారు. బళ్ళారి నుండి హైదరాబాదు వైపు వెళ్ళు వాహనాలు. ధనాపురం క్రాస్ – ఆదోని, మాధవరం, రాయచూరు, హైదరాబాదు. ఆదోని సిరిగుప్ప చెక్ పోస్టు – ఆదోని, ఎమ్మిగనూరు, నందవరం, నాగలదిన్నె, ఐజ, శాంతినగర్, ఉల్చాల వై జంక్షన్ – ఎల్కూరు బంగ్లా, విష్ణు టౌన్‌షిప్, సంతోష్ నగర్ మీదుగా వెళతాయన్నారు. నంద్యాల నుండి కర్నూలు వైపు వెళ్ళే వాహనాలు. తమ్మరాజుపల్లి, బేతంచెర్ల, డోన్, కర్నూలు తమ్మరాజుపల్లి, కాల్వబుగ్గ, ఎంబాయి, రామళ్లకోట, వెల్దుర్తి, కర్నూలు మీదుగా వెళతాయంన్నారం. ఓర్వకల్లు నుండి హైదరాబాదు వైపు వెళ్ళే వాహనాలు. ఓర్వకల్లు కన్నమడకల, చౌట్కూరు, కడుమూరు, మిడ్తూరు, నందికొట్కూరు, హైదరాబాదు. పూడిచెర్ల, కేతవరం, గార్గేయపురం, బ్రాహ్మణకొట్కూరు, హైదరాబాదు. ఎల్లమ్మగుడి, పడిదెంపాడు, పూడూరు, ర్యాలంపాడు, ఆలంపూరు మీదుగా వాహనాలు వెళుతాయన్నారు. చాలా చోట్ల కార్యక్రమం ముగిసేంత వరకు లారీలు ఇతర భారీ వాహనాలు ఉదయం 8.00 నుండి రాత్రి 9.00 గంటల వరకు ఆపేస్తామన్నారు. కర్నూలు పట్టణం మీదుగా ప్రయాణం చేయదలచిన వారు పై తెలిపిన ట్రాఫిక్ మళ్లింపు ను దృష్టిలో ఉంచుకొని పోలీసువారికి సహకరించాలని కర్నూలు జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ తెలిపారు.



జిఎస్‌టి సభకు భారీగా తరలి రావాలి

కోడుమూరు అసెంబ్లీ సమన్వయ కమిటీ సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈనెల 16న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేద్దామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పిలుపునిచ్చారు. కర్నూలు పట్టణంలోని స్థానిక ఎన్వీఆర్ హోటల్‌లో కోడుమూరు నియోజకవర్గంలోని 4 మండలాల టిడిపి బూత్, యూనిట్, క్లస్టర్ స్థాయి ఇంచార్జిలు, బిజెపి, జనసేన పార్టీ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, ముఖ్య అతిథిగా మీటింగ్ అబ్జర్వర్ కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు కె.రామలింగా రెడ్డి, బీజేపీ నాయకులు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భారీ బహిరంగ సభ కు డి.విష్ణువర్ధన్ రెడ్డి సారథ్యంలో అభిమానులు భారీగా తరలి రావాలన్నారు. విష్ణువర్ధన్ రెడ్డిమార్క్ చూపెట్టలన్నారు. కెడిసిసిబి చైర్మన్ డి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభకు ప్రతి గ్రామం నుండి భారీగా తరలి రావాలన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పరిశ్రమలు, పెట్టు బడులు వస్తున్న క్రమంలో ప్రధాని చేతులమీదుగా వాటిని ప్రారంభించే లక్ష్యంతో ఇక్కడ సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి జిఎస్‌టి తగ్గింపు వల్ల రూ.2లక్షల కోట్లు ఆదాయం పడిపోయినా ప్రజా సంక్షేమం కోరి జిఎస్‌టి తగ్గించారన్నారు. జిఎస్‌టి తగ్గింపు విషయం ప్రజల్లోకి తీసుకోవాల్సిన బాధ్యత కూటమి నాయకులపై ఉందన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిఎం ఆదేశించినట్లు తెలిపారు. జిఎస్‌టి సంస్కరణల తర్వాత తొలిసారి ప్రధాని ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. పార్టీ అధిష్ఠానం నిర్దేంచిన లక్ష్యానికి మించి జనసమీకరణ చేస్తున్నట్లు తెలిపారు.



అసెంబ్లీ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింమారెడ్డి

ఆడపిల్లలను రక్షిద్దాం..చదివిద్దాం...

అవగాహన ర్యాలీ



ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్ : కర్నూలు నగరంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా మాస్‌మీడియా అధికారి ప్రకాశ్ రాజు ఆధ్వర్యంలో ఆడపిల్లలను రక్షిద్దాం – ఆడపిల్లలను చదివిద్దాం (బేటి పడావో–బేటి బచావో) కిషోర బాలికలలో పోషకాహార ప్రాముఖ్యత అనే అంశాల పై విద్యార్థినులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. తదుపరి లింగ నిష్పత్తిలో అసమతుల్యత వల్ల వచ్చే నష్టాల గురించి వివరించారు. ప్రతి బాలిక ఒక లక్ష్యంతో ముందుకు వెళ్ళాలని, అంతేకాకుండా ఆడపిల్లలు చదువు కోవడం వల్ల వారు ఆర్థిక స్వావలంబన సాదించి వారికి ఉజ్వల భవిష్యత్తు సాకారం అవు తుం దన్నారు. కాబట్టి ఆడపిల్లలను పుట్టనిద్దాం, బ్రతనిద్దాం, చదవనిద్దాం – ఎదగనిద్దాం అని పిలుపునిచ్చారు. సమాజంలో స్త్రీ పురుషులు ఇరువురు సమానమే, స్త్రీ పురుషుల మధ్య ఏ వివక్షా ఉండకూడదని, నిజానికి పురుషుడి కంటే స్త్రీ ఏ విషయం లోనూ తక్కువకాదని తెలిపారు. అందుకే ఈనాడు అన్ని రంగాలలోను స్త్రీలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని తెలిపారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, లీగల్ కన్సల్టెంట్ సుమలత, డిప్యూటీ హెల్త్ ఎడ్యూకేషన్ ఆఫీసర్ పద్మావతి, ఆరోగ్య కార్యకర్త మానస, ఆశా కార్యకర్త అరుణ తదితరులు ప్రాజెక్షనిస్ట్ పాల్గొన్నారు.

పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ముఖ్యం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యార్థి తన జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలంటే పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ముఖ్యమని రాజమండ్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య విభాగం అధ్యాపకురాలు డాక్టర్ బి.ప్రతిమ పేర్కొన్నారు. మంగళవారం క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల ఇంగ్లీష్ విభాగం సమన్వయకర్త డాక్టర్ వై.రాజశేఖర్ అధ్యక్షతన వ్యక్తిత్వ వికాసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకురాలు డాక్టర్ బి.ప్రతిమ, డీన్ డాక్టర్ అక్తర్ భాను మాట్లాడుతూ క్లస్టర్ యూనివర్సిటీ విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరని విద్యార్థులు ఎక్కడైనా ఇంటర్వ్యూకు వెళ్లినప్పుడు అధికారులు మొదట్లోనే గమనిస్తూ ఉంటారన్న విషయాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ యూనివర్సిటీ ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ నాగరాజ్ శెట్టి, క్లస్టర్ యూనివర్సిటీ ఒఎస్‌డి డాక్టర్ ఎస్ఎం.బాష, డాక్టర్ మల్లయ్య, డాక్టర్ నాగ్ అరుణ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో గోల్డ్, సిల్వర్, కాంస్యం మెడల్స్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

మాస్టర్స్ ఆక్వాటిక్ ఫెడరేషన్ ఇటీవల గుంటూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో కర్నూలు మెడికల్ కాలేజీ అనస్తీసియా విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చందన రాజారాం స్విమ్మింగ్ లో ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రీస్ట్ స్ట్రోక్‌లో ఒక గోల్డ్, మెడల్ రెండు సిల్వర్ మెడల్స్, ఒక కాస్యం సాధించడం పట్ల ఎడిఎంఇ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ హర్షం వ్యక్తం చేశారు. కెఎంసి విద్యార్థులు ఉపాధ్యాయులు జాతీయ రాష్ట్రస్థాయిలో వైద్య విద్యలో ప్రతిభ కనబరచడమే కాకుండా లోనే కాకుండా విభిన్న రంగాల్లో ప్రతిభ కనపరుస్తుండడం పట్ల సంతోషాన్ని వ్యక్తపరిచారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ చేతుల మీదుగా డాక్టర్ చందన రాజారామ్ మెడల్స్ స్వీకరించారు.



విద్యార్థి బస్సు సరయిన సమయానికి నడపాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- గూడూరు

స్థానిక విద్యార్థులు సమయానికి బస్సులు రాక విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా కమిటీ సభ్యులు ఖాజావలి మండల నాయకులు శేఖర్ పాల్గొని వీరులు మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాలకు కళాశాలకు సమయానికి చేరుకోలేకపోతున్నారని అందువలన విద్యార్థులకు చదువుకు దూరమయ్యే పరిస్థితిలో వస్తున్నారని ప్రభుత్వం విద్యార్థులు సమయాలకు దష్టిలో పెట్టుకొని విద్యార్థులకు సరైన సమయానికి సొంత గ్రామాల నుంచి పాఠశాలకు కళాశాలకు చేరుకోవాలంటే విద్యార్థి బస్సులు ఏర్పాటు చేయాలన్నారు లేకపోతే విద్యార్థులను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలను నిర్వహిస్తామని ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు ధనుష్ మనోహర్ రాఘవ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణ దారులకు నోటీసులు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

ప్రజారోగ్యం విభాగం కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు కర్నూలు నగరంలో ప్రధాన రహదారుల పైన పందులు, ఆవులు, గాడిదలు , గేదెలు ఇష్టానుసారంగా వదిలేసి ప్రజలకు , ట్రాఫిక్‌నకు అంతరాయం కలిగించినందుకు వాటిని వెంటనే వాటి నివాస స్థలానికి తరలించాలని తెలుపుతూ నోటీసు జారీ చేశారు. జిఒఆర్‌టి నెం. 1109, తేది: 10–10–2025 మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సూచిక మేరకు కర్నూలు నగరం నందలి వీధి జంతువులను పెంచుకుంటున్న యజమానులందరు పెంచుకుంటున్న వీధి జంతువులు పందులు, ఆవులు, గాడిదలు,గేదెలు ప్రతి రోజు నగరంలోని ప్రధాన రహదారులలో రోడ్డుకు మధ్యలో విహరిస్తూ ప్రజలకు, ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నాయన్నారు. ట్రాఫిక్‌నకు చాలా అంతరాయం కలిగిస్తున్నాయి. ఇలా ఉండడం ద్వారా ప్రయాణికులకు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఈ విషయంపై మీరు ఇంతవరకు పెంచుకుంటున్న వీధి జంతువులను మీ నివాస స్థలాలలో తరలించకుండా ఇష్టానుసారంగా రోడ్లపై వదిలి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తురన్నారు. ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తున్నారని గమనించామన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతా దృష్ట్యా ప్రధాన రహదారులలో రోడ్డుకు మధ్యలో మీరు పెంచుకుంటున్న వీధి జంతువులు అయిన పందులు, ఆవులు, గాడిదలు మరియు గేదెలను వెంటనే మీ నివాస స్థలాల యందు తరలించి వాటి సంరక్షణ చూసు కోవాలని వాటిని రోడ్లపైన ప్రధాన రహదారులపైన తిరగకుండా చర్యలు తీసికోవాలన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంజనీర్ సుబ్బరాయుడుకు నివాళి

ప్రజాశక్తి–కర్నూలు కార్పొరేషన్

నీటి ప్రోజెక్టుల సాధన కోసం నిరంతరం శ్రమించిన దార్శనికుడు, నీటిపారుదల నిపుణులు, విశ్రాంత ఇంజనీర్ ఎం.సుబ్బారాయుడుకు సిఐటియు న్యూ సిటీ అధ్యక్ష కార్యదర్శులు నగేష్, నరసింహులు జోహార్లు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కర్నూలు జిల్లాలో ఉన్న సాగునీటి వనరులను ఉపయోగించుకొని ఏ విధంగా ప్రాజెక్టులు డిజైన్ చేస్తే తుంగభద్ర, హంద్రీనీవా ద్వారా ప్రవహిస్తున్న నీటిని సక్రమంగా వినియోగించుకోవచ్చో ప్రజలకు ఉపయోగపడే విధంగా ముఖ్యంగా కర్నూలు జిల్లా రైతాంగానికి ఉపయోగపడే విధంగా సాగునీటి ప్రాజెక్టుల డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్టులను తయారు చేసిన విశ్రాంత ఇంజనీర్ సుబ్బరాయుడు మరణం కర్నూలు జిల్లా రైతన్నలకు తీవ్రమైన లోటు అని తెలిపారు.

ప్రధాని పర్యటనతో ఒరిగేదేమీ లేదు: కాంగ్రెస్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనతో కర్నూలు జిల్లా ప్రజలకు ప్రజాధనంవృధా తప్ప ఒరిగేది ఏమీ లేదని కర్నూల్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలానిబాష అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన పేరుతో రూ.కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. అనేకసార్లు రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని రాష్ట్ర సమస్యలపై ఒక మాట కూడా మాట్లాడలేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు రాయలసీమ వెనుకబడిన ప్రాంతానికి ప్రత్యేక ప్యాకేజీ కేటాయింపు పై స్పష్టమైన ప్రకటన చేయలేదన్నారు. జిఎస్‌టితో ప్రజల నుండి పెద్ద ఎత్తున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డబ్బులు దండుకున్నాయన్నారు. అందుకే నరేంద్ర మోడీ పర్యటనను వ్యతిరేకిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహేంద్ర నాయుడు, ఎస్సి సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు ఇ లాజరస్, ఐఎన్‌టియుసి సిటీ అధ్యక్షులు ఆర్.ప్రతాప్, యూత్ కాంగ్రెస్ నాయకురాలు రాజేశ్వరి, బస్తిపాడు దస్తగిరి పాల్గొన్నారు.